# హాసంతి

[కథానిక]

## శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు

నర్సాపురం మార్కెట్టుప్రాంతంలోకి వచ్చేటప్పటికి-కుర్రవాడు "ఇదేకదా తాతయ్యా మార్కెట్టు! ఇక్కడనేగా—చెట్టు పడిపోయి చెట్టుక్రింద కాపురమున్న బిచ్చగాళ్లు చాలామంది చచ్చిపోయింది?" అని తాతయ్యను ప్రశ్నించాడు.

"అవునుగాని—నీకీసంగతి యెవరు చెప్పారురా బాబూ" అన్నాడు తాత.

"లక్ష్మడు—ప్రొద్దున్న నీతో చెప్తున్నాడుగా-మనం మార్కెట్టులోనుంచి పోదాము తాతయ్యా! ఆ పడిపోయిన చెట్టూ—అదీ చూద్దాము."

"వద్దురా! బాబూ! కాలవగట్టునుంచి పోదాము—అక్కడ మీనాయన చిన్నప్పుడు చదువుకున్న స్కూలు ఉన్నది. దాన్ని చూద్దువుగాని"—అన్నాడు తాతయ్య.

"కాదు—నేను మార్కెట్టులో పడిపోయిన చెట్టూ—దానిక్రింద పడి చనిపోయిన బీదవాళ్లనూ—చూడాలసిందే!—లక్ష్మడూ! మన బండీ ఆ చెట్టు ప్రక్కనుంచితోలరా—తాతయ్యకూడ ఒప్పుకున్నట్టే" అని మంకుపట్టు చూపించాడు కుర్రవాడు. సాధారణంగా ముసలివాళ్ళకూ—పసివాళ్ళకూ అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు—పసివాళ్ల మాట నెగ్గుతున్నట్లుగానే—యిప్పుడుకూడా ఆరేళ్ల మనుమడు—అరవైయేళ్ళతాతయ్యమాటను తోసిరాజన్నాడు.

ఆ మనుమని—ఆ తాతయ్య యేయే పరిస్థితులలో పెంచుతుంటూ వస్తున్నాడో తెలిసినవాళ్ళంతా తాతయ్య మనుమని కోర్కె తీర్చివుంటాడనే వూహిస్తారు.

ఆ తాతయ్య వయస్సులో వుండగా—లేక లేక—పదేళ్ల సంసారసౌఖ్యానుభవంఫలితంగా—వొక్క కొడుకుని ప్రసవించి—భార్య చనిపోయింది. ఆ పసికూనను చూచుకుంటూ మళ్లా పెళ్లిసంగతి తలపెట్టకుండా—రోజులు వెళ్ళబుచ్చాడు—కొడుక్కి యిరవైయేళ్ళు రాగానే పెండ్లిచేసి—ఆస్తి వప్పగించి తాను 'కృష్ణా—రామా' అంటూ కూర్చున్నాడు. కాని దురదృష్టవశాత్తూ — తరువాత రెండేళ్లకు—కోడలు—యీ పసికూనను ప్రసవించి చనిపోయింది. మళ్లా దుఃఖసాగరం—కొడుక్కి పునర్వివాహప్రయత్నం—రెండోపెళ్లి లగ్నం పెట్టుకొని—సర్వసన్నాహాలూ సాగుతుండగా—కొడుకు మశూచివ్యాధి సోకి మరణించడం—మళ్లా తాను పుట్టెడంత దుఃఖమూ దిగమ్రింగుకుంటూ—యీ పసికందును సాకుతూ ఆస్తివ్యవహారాలు చూచుకొంటున్నాడు. అధిక దుఃఖవ్యవసాయమైన తన జీవితంలో—యీచిన్న మనుమణ్ణి చూచుకుంటూ తాతయ్య రోజులు గడుపుతున్నాడు. తానే చనిపోయి తన కుమారుడు బ్రతికివుంటే బాగుండేదని నిత్యమూ భావిస్తున్నప్పటికిన్నీ మనుమడియెదటమాత్రం—నిత్యసంతోషిగా — తాత అగుపిస్తూవుంటాడు— లేకపోతే— యిప్పటినుంచీ—తన దుఃఖాలు మనుమడికి వెళ్ళబోసుకుంటే—కుర్రవాడు బేజారెత్తిపోతాడని తాతయ్యఅభిప్రాయం. తను అనుభవిస్తున్న అనంతదుఃఖాన్ని— తన గుండెలమీది కుంపటిని తన పసికందుకి తెలియకుండా, కనపడకుండా రోజులు గెంటుతున్నాడు.

కుర్రవాడిని వాడి మేనమామలు పెంచుతానన్నారు—కాని వాడిని చూచుకొనికదా తాను బ్రతుకుతున్నది. వాడు యెదురుగా వుండటంవల్ల తను దుఃఖాన్ని దిగమ్రింగగలుగుతున్నాడు. తను జీవితం వెళ్లబోస్తున్నాడు. కుర్రవాడు తనదగ్గర లేనివాడు తనకు దుఃఖం నిత్యప్రసన్నంగా వుంటుంది. తన జీవితం వెళ్లదు. తన మనస్సు కుమిలిపోతుంది. తన గుండె మీద కుంపటి ప్రజ్వలిస్తుంది. తన కళ్లు వర్షభ్రమ కలిగిస్తవి. తన గుండె ఆగిపోతుంది.

కాని ఆరోజు వుదయం—ఉప్పెన తగ్గిన మరునాడే—తన వంటెద్దుబండీమీద—కుర్రవాడిని మేనమేనుల యింటికి తీసుకువస్తున్నాడు తాతయ్య.

ఉప్పెనగాలివల్ల సముద్రకెరటం తమ ఊళ్లోకి వచ్చింది. అధికంగా పశునష్టమూ, జననష్టమూ కలిగింది. ఎవళ్ల పశువులు యేమైందీ—ఊళ్లో యెవరేమైందీకూడా తెలియకుండా వున్నది. చిన్న-చిన్న యిళ్లన్నీ నేలమట్టమయినాయి. ఊరంతా సకలబీభత్సంగా వున్నది. తమ గడ్డివాములన్నీ పోయినాయి. దుక్కిటెద్లు యేమైందీ తెలియదు. పాడిగేదెలు కనబడడం లేదు. భూములు యెంతవరకు 'ఉప్పు' వేసి పోయినవో తెలియదు. ఇవన్నీ సరిచూచుకునేటప్పటికి నెలరోజులు పట్టేటట్లుగా వున్నది. ఈ నెలనాళ్లూ—తను భూముల పనీ—పశుశాలలపనీ చూస్తూవుంటే—కుర్రవాడికి పోషణ తగ్గుతుంది. అందుచేత అయిదు మైళ్ల దూరంలో వున్న అతని మేనమామల యింట్లో దింపివద్దామని ఆనాటి ఉదయం లక్ష్మడుచేత వంటెద్దు బండీ కట్టించుకుని తాతయ్య బయలుదేరాడు.

లక్ష్మడు తాతయ్యగారి పాలెకాపు. ఇరవై యేళ్ల యౌవనంలో వున్నాడు. తాతయ్య అరవయ్యేళ్లు పడి దాటినవాడు. కుర్రవాడు, యిప్పుడిప్పుడే ప్రాపంచికవిషయాలు ద్యోతకాలు చేసుకుంటూన్న ఆరేళ్ల బాలుడు. ఈ ముగ్గురూ—ఉప్పెనగాలి తగ్గిన మర్నాడే—క్రొత్తప్రపంచంలోనికి బయలుదేరారు. బండి వడిగానే పోతున్నది. పాలుగయిదురోజుల నుంచీ గడ్డిమొఖము యెరుగనిదైనప్పటికిన్నీ—జలం మీద వున్న యెద్దుకనక—బాగానే సాగిస్తూవున్నది.

"అదిగో పడిపోయిన చెట్టు" అన్నాడు కుర్రాడు, అల్లంత దూరంలో మార్కెట్టులో పడి వున్న చెట్టు కనుపించగానే. "అదిగో, ఆచెట్టుకొమ్మ క్రింద చచ్చిపోయిన మనిషి" అన్నాడు యింకా కొంచెం సమీపంలోనికి రాగానే.

మార్కెట్టులో మఱ్ఱిచెట్టు తలక్రిందులై వున్నది. దానిక్రింద అనాథలైన బిచ్చగాళ్ళ శవాలు వున్నవి. ఉప్పెనగాలి ఆరోజువుదయమే తగ్గింది. జనం గుంపులు గుంపులుగా చెట్టుచుట్టూ మూగివున్నారు.

"అదిగో యింకోమనిషి—యింకోటి—చాలా మంది చచ్చిపోయారు"—అన్నాడు బాలుడు, చెట్టు మరీ సమీపంలోకి రాగానే, దానిక్రింద పడివున్న పదీ పదిహేనుశవాలు కనుపించడంతోటే.

"అదిగో—అప్పుడే—ఆ అమ్మి పచ్చగడ్డిమోపు అమ్మకానికి తెచ్చింది. మన యెద్దుకు కావాలి—అటు చూడు!" అన్నాడు తాతయ్య.

"ఆ పచ్చగడ్డి అమ్మికూడా చచ్చిపోయిందా!" అన్నాడు కుర్రాడు.

"లేదు లేదు—చచ్చిపోలేదు. బాగానే సుఖంగానే వున్నది" అని సమాధానం చెప్పాడు తాతయ్య.

"అయితే నేను చచ్చిపోయినప్పుడు కూడా—యిట్లాగా పడివుంటే చూస్తారా?" అన్నాడు కుర్రాడు.

"నీవు చనిపోవురా బాబూ!" అని ఆందోళనగా సమాధానం చెప్పాడు తాతయ్య.

"చనిపోతే — తరవాత ఏన్నేం చేస్తారు?" అన్నాడు కుర్రవాడు.

"అసలు నీవు చనిపోవంటూంటేనూ! మళ్లా అదే ప్రశ్నా?...త్వరగా పోనివ్వరా బండీ..."

"మన దొడ్లో మోటనూతిలో పడి పిల్లికూన చచ్చిపోలేదూ? నేనుమాత్రం మోటబావిలోకి దూకితే చచ్చిపోనూ—"

ఒక్కసారిగా—మోటబావీ — పిల్లికూనా—మోటబావిలోతూ — కుర్రాడు దానిఒడ్డున నుంచున్నట్లూ—దానిలో దూకినట్లూ—పదిమంది చేరినట్లూ—కుర్రాణ్ణి పైకి తీసినట్లూ—లాభం లేదన్నట్లూ కళ్ళ ముందు — తాతయ్యకు మెరిసిపోయింది. మనస్సు భ్రమించిపోయింది.

"అవును!" అన్నాడు తాతయ్య దుఃఖసూచకంగా. బండీ గబగబా నడచింది. మార్కెట్టు దాటి మామూలు రోడ్డుమీదకు పోయింది. మృత్యుప్రసన్నత నుంచి, దూరదూరంగా జీవస్రవంతులవంటి రహదారుల్లోకి పోయింది.

కుర్రవాడి మేనమామల యిల్లు వచ్చింది. వీళ్ళ క్షేమసమాచారాలకోసం ఆందోళనపడుతూన్న మేనమామలు అకస్మాత్తుగా వచ్చిన వీళ్లను చూచి ఆనందించారు.

తాతయ్యనుకూడా ఆరోజు అక్కడ ఉండమన్నాడు. కాని తాతయ్య పనితొందరలమూలంగా వెంటనే తిరిగిపోతా నన్నాడు. మనుమని, 'జాగ్రత్త జాగ్రత్త' అని పదిసార్లు చెప్పాడు.

మేనమామలు కుర్రాడు చాలా తెలివిగలవాడవుతాడనీ—తాతయ్యను చాలా సుఖపెడ్తాడనీ అన్నారు.

తానుకూడా అట్లాగే అనుకుంటున్నాడని తాతయ్య సమాధానం చెప్పాడు.

చదువు బాగా చదువుతాడని మేనమామలు అభిప్రాయపడ్డారు.

ప్రతీదీ పరీక్ష చేసి చూడాలంటాడు యిప్పుడు కొంచెం చెప్పినమాట వింటున్నాడు" అని తాతయ్య అన్నాడు.

"అట్లా అయితే మంచిదే—గొప్ప శాస్త్రజ్ఞుడు కాగలడన్నమాట" అన్నాడొక మేనమామ.

"అట్లాగయితే ప్రతివస్తువు నీ—ప్రమాదాలు గుర్తించకుండా పరీక్ష చెయ్యాలంటారా" అన్నాడు ఆందోళనగా తాతయ్య.

"స్వయంగా పరీక్ష చేసి ఆర్జించిన విజ్ఞానం చాలా గొప్పది" అన్నాడా మేనమామ.

అప్పుడే కుర్రాడు మేనమామలగారి మేడమీదికి గెంతుకూ యెక్కబోవడం - కాలు జారి మెట్లమీద పడటం—చూస్తూనేవున్నాడు. తాతయ్య

ఇహ ప్రొద్దెక్కుతున్నదనీ, యెండలో ప్రయాణం కష్టమనీ త్వరగా బయలుదేరాడు తాతయ్య. తన మనస్సూ — దృష్టీ అంతా మనుమడిమీదనే ఉండిపోయింది. కాని తిరుగుముఖంప్రయాణంలో యెద్దు యింకా తొందరగా నడిచింది. రెండు నిమిషాల్లో మళ్లా మార్కెట్టులోకి వచ్చిచేరింది. ఇంకా జనం అట్లాగే మూగివున్నారు. ముసలాయనమనస్సులో మనుమడు కనబడుతూ నేవున్నాడు. లక్ష్మడు—మళ్లా ఆత్రోవనే బండీ తోలుకువచ్చాడు.

జనం గుంపులుగుంపులుగా మూగివున్నారు. శవాలు అట్లానే పడివున్నాయి. పచ్చగడ్డి అమ్మి—మోపు క్రిందకు దించుకుని—చూస్తూ నుంచునివున్నది. యౌవనారంభంలో వున్న లక్ష్మయ్యమనస్సు—బలిష్ఠమైన అవయవసౌందర్యంతో నిలబడివున్న పచ్చగడ్డి అమ్మిని చూచి కలవరపడింది.

లక్ష్మయ్యయెద్దు క్రిందవున్న పచ్చగడ్డిమోపుమీదకు బండి లాగుతూన్నది.

ముసలాయనమనస్సులో మనమడు కనబడుతూనేవున్నాడు. మేనమామలగారి మేడమీదకు యెక్కినట్లుగా—మేడమీదనుంచి క్రిందకు దూకితే యేమవుతుందో తెలుసుకుందామని—దూకినట్లుగా అనిపించింది.

ముసలాయన "హా!" అని ఒక్క కేక వేసి నిశ్చేష్టితుడై బండిలో పడిపోయాడు.

లక్ష్మయ్య—పచ్చగడ్డి అమ్మిని — మోపు యెంతని పలకరించాడు.

ఎద్దు—మోపుమీద కలబడింది.